క్లుప్తంగా

క్రమశిక్షణతో విద్యను అభ్యసించాలి

ఎంఈవోలు శోభాచంద్, శేషుగోపాలం



నిజాంపట్నం: విద్యార్థులు క్రమశిక్షణతో విద్యను అభ్యసించాలని మండల విద్యాశాఖాధికారులు ఆర్.శోభాచంద్, జి.శేషుగోపాలం చెప్పారు. నిజాంపట్నంలోని ఎక్స్ సరీ్వస్ మెన్ కాలనీలో ఉన్న ప్రాథమిక పాఠశాలను బుధవారం వారు పరిశీలించి మాట్లాడారు. ఐదో తేదీ నాటికి విద్యార్థులు పూర్తి యూనిఫామ్ ధరించి పాఠశాలకు హాజరు కావాలన్నారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం చుక్క బాపయ్య, ఉపాధ్యాయురాలు షేక్ ఆరిఫున్నిస తదితరులు పాల్గొన్నారు.

కర్లపాలెం తహసీల్దార్‌గా షాకీర్ పాషా



కర్లపాలెం: కర్లపాలెం తహసీల్దార్‌గా షాకీర్ పాషా బుధవారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఆయన నిజాంపట్నం మండల తహసీల్దార్‌గా పనిచేస్తూ కర్లపాలెం మండలానికి బదిలీపై వచ్చారు. ఇప్పటివరకు ఇక్కడ తహసీల్దార్‌గా పనిచేసిన సుందరమ్మ గత నెల 30వ తేదీన పదవీ విరమణ చేశారు. తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన షాకీర్ పాషాను ఎంపీడీవో అద్దూరి శ్రీనివాసరావు, ఈవోపీఆర్డీ ఐ.శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శులు మర్యాద పూర్వకంగా కలసి పుష్పగుచ్ఛం అందజేశారు.

వాహనాల తనిఖీ



చందోలు(కర్లపాలెం): వాహనదారులు పరిమిత వేగంతో ప్రయాణించి సురక్షితంగా గమ్యస్థానాలను చేరాలని కర్లపాలెం ఎస్ఐ రవీంద్ర చెప్పారు. బుధవారం కర్లపాలెం ఐలాండ్ సెంటర్‌లో ఎస్ఐ సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీ నిర్వహించారు. ద్విచక్ర మోటారు వాహనాలపై ప్రయాణించే వారు హెల్మెట్ పెట్టుకోవాలని, కార్లు నడిపే వారు సీటు బెల్టు పెట్టుకోవాలని ఎస్ఐ తెలిపారు. ఆటోలలో పరిమితికి మించి ప్యాసింజర్లను ఎక్కించవద్దని పరిమిత వేగంతో వాహనాలు నడపాలని ఆటో డ్రైవర్లకు సూచించారు. వాహనాలకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాలు, లైసెన్సు వాహనంలో ఉంచుకోవాలని ఎస్ఐ చెప్పారు.

ఆప్షన్ల నమోదుకు 5వ తేదీ వరకు గడువు

రేపల్లె: ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల్లో ప్రవేశాలకై కౌన్సెలింగ్ ప్రక్రియ విజయవంతంగా ముగిసిందని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.చంద్రశేఖర్ బుధవారం తెలిపారు. కౌన్సెలింగ్‌కు హాజరైన విద్యార్థులు కళాశాలల ఆప్షన్ నమోదు చేసుకునేందుకు ఈ నెల 5వ తేదీ వరకు అవకాశం ఉందన్నారు. 6న ఆప్షన్ మార్పులు చేర్పులు చేసుకోవచ్చన్నారు. 10వ తేదీ నుంచి తరగతులు ప్రారంభమవుతాయని తెలిపారు.

మురుగు కాల్వలపై ఎటుంటి కట్టడాలు నిర్మించవద్దు

మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక



తెనాలిఅర్బన్: మురుగు కాల్వలపై ర్యాంప్‌లు, బండలు ఏర్పాటు చేయటం వల్ల కాల్వల మరమ్మతులకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయని, వాటిపై ఎటువంటి కట్టడాలు నిర్మించవద్దని మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక పేర్కొన్నారు. పట్టణంలోని 4,5 వార్డులలో బుధవారం చేపట్టిన ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాన్ని ఆమె పరిశీలించారు. ఎక్కువ మంది కాల్వలపై ర్యాంప్‌లు ఏర్పాటు చేయడాన్ని గమనించిన ఆమె సిబ్బందిపై అసహనం వ్యక్తం చేశారు. ఎందుకు ఇప్పటి వరకు వాటిని తొలగించలేదని ప్రశ్నించారు. వెంటనే వాటిని తొలగించాలని ఆదేశించారు. కాల్వలను ప్రతిరోజు కార్మికులు బాగు చేయాల్సి ఉంటుందని, అలా చేయకపోతే నీరు పారుదల లేక ఇబ్బందులు ఏర్పడతాయని చెప్పారు. ఆమె వెంట కౌన్సిలర్‌లు అడుసుమల్లి వెంకటేశ్వరరావు, తోట రఘురామ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు, పలువురు మున్సిపల్, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.

ఇండోర్ స్టేడియంకు గ్రహణం

- మధ్యలో నిలిచిపోయిన నిర్మాణ పనులు
- పట్టించుకోని పాలకులు, అధికారులు
- ఎన్నికల నాటికి 70 శాతం పూర్తయిన పనులు
- గత ప్రభుత్వానికి మంచి పేరు వస్తుందని దురుద్దేశంతో అడ్డుకుంటున్న కూటమి నేతలు




పనులు నిలిచిపోవటంతో ఇండోర్ స్టేడియం ప్రస్తుత స్థితి

రేపల్లె : ప్రతి ఒక్కరి బాల్యం ఆటలతోనే ప్రారంభమవుతుంది. ఆటలు ఆడటం వల్ల మనిషి ఆరోగ్యంగా, ఉత్సాహంగా ఉంటాడు. క్రీడల ఆవశ్యకతను గుర్తించిన గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం గ్రామీణ స్థాయి నుంచి క్రీడాకారులను ప్రోత్సహించాలన్న లక్ష్యంతో పలు కార్యక్రమాలకు శ్రీకారం చుట్టింది. అయితే ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఆ కార్యక్రమాలను పూర్తిగా విస్మరిస్తుంది. క్రీడాకారుల ప్రతిభను గుర్తించిన గత ప్రభుత్వం ఆడుదాం ఆంధ్ర కార్యక్రమం ద్వారా మండల నుంచి రాష్ట్ర స్థాయి వరకు పోటీలు నిర్వహించి క్రీడాకారులను ప్రోత్సహించింది. నియోజకవర్గ స్థాయిలో క్రీడాకారులు క్రీడలలో తర్ఫీదు పొందేందుకు వీలుగా ఇండోర్ స్టేడియంల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. దీనిలో భాగంగా 2023 సంవత్సరంలో రేపల్లె పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల గ్రౌండ్‌లో రూ.2 కోట్లతో ఇండోర్ స్టేడియం నిర్మాణం ప్రారంభించారు. పనులు తుది దశకు చేరుకునే నాటికి ఎన్నికల కోడ్ రావడం, తర్వాత కూటమి ప్రభుత్వం ఏర్పడడంతో స్టేడియం నిర్మాణానికి గ్రహణం పట్టింది. కూటమి ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం గడిచినా ఇండోర్ స్టేడియం నిర్మాణంపై శ్రద్ధ చూపకపోవడంతో పనులు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. గత ప్రభుత్వంలో ప్రారంభించి చివరి దశలో ఉన్న పనులను పూర్తి చేస్తే గత ప్రభుత్వానికి మంచి పేరు వస్తుందనే దురుద్దేశంతో ఉద్దేశ పూర్వకంగానే అడ్డుకుంటున్నట్లు ప్రజా సంఘాల నాయకులు బహిరంగంగా విమర్శిస్తున్నారు. ఎన్నికల నాటికి 70 శాతం పూర్తయిన స్టేడియం నిర్మాణ పనులను పూర్తి చేస్తే తీర ప్రాంతంలోని క్రీడాకారులు శిక్షణ పొందేందుకు చక్కని వేదిక ఏర్పడుతుంది. పాలకులు, అధికారులు స్పందించి స్టేడియం పనులపై దృష్టి సారించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది.

ఇండోర్ స్టేడియంతో ఉపయోగాలివే...

తీరంలో అనేక మంది క్రీడాకారులు తమ ఆటలను మెరుగు పరుచుకునేందుకు పట్టణంలో నిర్మిస్తున్న ఇండోర్ స్టేడియం ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. స్టేడియంలో ఉండే వసతులతో తర్ఫీదు పొంది తమ నైపుణ్యాలను మరింత మెరుగుపరుచుకునే అవకాశం ఏర్పడుతుంది. కబడ్డీ, కోకో, వాలీబాల్, షటిల్ బ్యాడ్మింటన్, తైక్వాండో, చెస్, క్యారమ్స్ వంటి అనేక ఆటలకు తర్ఫీదు పొందటంతో పాటు పోటీల నిర్వహణకు చక్కని వేదికగా రూపుదిద్దుకుంటుంది. నేటి వరకు రేపల్లె నియోజకవర్గంలో క్రీడాకారులు తమ ఆటలను మెరుగు పరుచుకునేందుకు ప్రత్యేక ఆట స్థలం గానీ, స్టేడియంలు గానీ లేకపోవటంతో నిరాశ చెందుతున్నారు. స్టేడియంలు లేకపోవటంతో గతంలో కల్యాణ మండపాలు, మార్కెట్‌యార్డు ఆవరణలో పలు పోటీలు నిర్వహించిన సందర్భాలు ఉన్నాయి. పాలకులు స్పందించి స్టేడియం పనులు త్వరితగతిన పూర్తి చేసి క్రీడాకారులకు కానుకగా అందించాలని పలువురు క్రీడాకారులు కోరుతున్నారు.

• 'రీ కాల్ చంద్రబాబు మేనిఫెస్టో' కార్యక్రమం



బాపట్లలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో బుధవారం 'రీ కాల్ చంద్రబాబు మేనిఫెస్టో' పేరుతో బాబు ష్యూరిటీ – మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్‌సీపీ ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల రీజినల్ కో–ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి అంజనీ ప్రసాదరెడ్డి. – సాక్షి ప్రతినిధి, బాపట్ల

ప్రజా సంక్షేమమే కూటమి లక్ష్యం

మంత్రి అనగాని సత్యప్రసాద్



రేపల్లె: రాష్ట్ర ప్రజల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ అన్నారు. సుపరిపాలన తొలి అడుగు ఇంటింటికీ కార్యక్రమంలో భాగంగా బుధవారం సాయంత్రం మండలంలోని కారుమూరు గ్రామంలో ఆయన పర్యటించి మాట్లాడారు. సంవత్సర కూటమి పాలనపై ప్రజలు సంతృప్తికరంగా ఉన్నారన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను సీఎం చంద్రబాబు నాయుడు విజయవంతంగా అమలు చేస్తున్నారన్నారు. సంవత్సర పాలనపై ప్రజల అభిప్రాయాన్ని తెలుసుకునేందుకు ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. ఈ సందర్భంగా బ్రోచర్లను గ్రామస్తులకు అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పంతగాని మురళీధర్ రావు, గుడపాటి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాలు కేటాయింపులో ప్రభుత్వం విఫలం

రెవెన్యూ కార్యాలయం వద్ద నిరసన



కొల్లూరు రెవెన్యూ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న మహిళలు, ప్రజా సంఘాల నాయకులు

కొల్లూరు : పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించడంలో కూటమి ప్రభుత్వ వైఫల్యాన్ని ఎండగడుతూ మహిళలు నిరసన ప్రదర్శన చేపట్టారు. ఇళ్ల స్థలాలు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న కొల్లూరు శివారు గాంధీనగర్‌కు చెందిన మహిళలు బుధవారం రెవెన్యూ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇళ్ల స్థలాలు కేటాయిస్తామన్న హామీని నిలబెట్టుకొని తక్షణం అర్హులైన లబ్ధిదారులకు స్థలాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకులు టి.కృష్ణమోహన్, బి.సుబ్బారావులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయినా ఇళ్ల స్థలాలు కేటాయించకపోవడం దురదృష్టకరమన్నారు. తక్షణం ప్రభుత్వం అర్హులైన లబ్ధిదారులను గుర్తించి ఇళ్ల స్థలాలు కేటాయించాలని డిమాండ్ చేశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో మంజూరు చేసిన ఇళ్ల స్థలాలకు పట్టాలు ఇచ్చిన అధికారులు లబ్ధిదారులకు స్థలాలు చూపించని కారణంగా వారు ఇళ్లు నిర్మించుకోలేని పరిస్థితిలో ఉన్నారని తక్షణం అధికారులు లబ్ధిదారులకు కేటాయించిన స్థలాలను అప్పగించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా గాంధీనగర్‌లో ఇళ్ల స్థలాలు లేని ఎస్టీ సామాజిక వర్గానికి చెందిన అర్హులకు ఇళ్ల స్థలాలు కేటాయించడంతోపాటు, మండలంలోని అర్హులకు స్థలాలు మంజూరు చేయాలని కోరుతూ తహసీల్దార్ బి.వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందజేశారు.

ట్రిపుల్ ఐటీకి ఎంపికైన విద్యార్థులకు సత్కారం

భట్టిప్రోలు (కొల్లూరు) : గ్రామీణ ప్రాంత విద్యార్థులు ఉన్నతమైన సాంకేతిక విద్యను అభ్యసించడానికి పోటీతత్వంతో చదువుల్లో రాణించడం హర్షణీయమని ఎంపీపీ దావూరి లలితకుమారి అన్నారు. బుధవారం మండలంలోని ఐలవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ట్రిపుల్ ఐటీకి ఎంపికైన 9 మంది విద్యార్థుల సన్మాన కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు ఉదయభాస్కరితో కలసి ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో 43 మంది విద్యార్థులు ట్రిపుల్ ఐటీకి ఎంపికైతే, భట్టిప్రోలు మండలం నుంచి ఏకంగా 18 మంది విద్యార్థులు సీట్లు దక్కించుకోవడం గర్వకారణమన్నారు. ఈ సందర్భంగా ట్రిపుల్ ఐటీకి ఎంపికైన విద్యార్థులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎంఈవో ఎన్.దేవరాజు, విద్యా కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్‌లు దుర్గాదేవి, జి.రవి, ప్రధానోపాధ్యాయుడు మాచర్ల మోహనరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ట్రిపుల్ ఐటీకి ఎంపికైన విద్యార్థులతో ఎంపీపీ, జెడ్పీటీసీ సభ్యురాలు, ఉపాధ్యాయులు

ప్రజలను మోసగించడం చంద్రబాబు నైజం

- వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, వేమూరు ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు
- నేడు అద్దేపల్లిలో సూపర్ సిక్స్ మేనిఫెస్టోను గుర్తు చేస్తూ క్యూఆర్ కోడ్ పోస్టర్ ఆవిష్కరణ



భట్టిప్రోలు (కొల్లూరు) : ఎన్నికలకు ముందు సూపర్ సిక్స్ పేరుతో ప్రకటించిన మేనిఫెస్టోను అమలు చేయకుండా ప్రజలను సీఎం చంద్రబాబు మోసగిస్తున్నారని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, వేమూరు నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలను మభ్యపెట్టి మోసగించడమే నైజంగా వ్యవహరిస్తున్న చంద్రబాబు అబద్ధపు హామీలను ప్రజలకు గుర్తు చేయాల్సిన బాధ్యత తమపై ఉందన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఇచ్చిన ప్రతి హామీని రాజకీయాలు, కుల మతాలకు అతీతంగా అమలు చేసి ప్రజల విశ్వాసాన్ని చూరగొన్నారన్నారు. మాజీ సీఎం జగన్‌ను ఎన్నికలలో ఎదుర్కొనడం అసాధ్యమన్న విషయాన్ని గమనించిన చంద్రబాబు మరో రెండు రాజకీయ పార్టీలతో జతకట్టి ప్రజలను అబద్ధపు హామీలతో మభ్యపెట్టి అధికారంలోకి వచ్చారని విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయినా ఎన్నికలకు ముందు ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయకుండా కుంటి సాకులతో కాలయాపన చేయడమే చంద్రబాబు మోసకారి తననానికి నిదర్శనమన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమైన చంద్రబాబు సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయకుండానే అమలు చేశామని మభ్యపెట్టడానికి ప్రయత్నించడం, అమలు చేయలేదని ఎవరైనా అంటే వారి నాలుకలు మందం అనడం ఆయన అహంకారానికి నిదర్శనమన్నారు. చంద్రబాబు ఎన్నికలకు ముందు సూపర్ సిక్స్ పేరుతో ప్రకటించి అమలు చేయని మేనిఫెస్టోను ప్రజలకు గుర్తు చేసేందుకు గురువారం భట్టిప్రోలు మండలం అద్దేపల్లిలో క్యూఆర్ కోడ్‌తో కూడిన పోస్టర్‌ల ఆవిష్కరణ కార్యక్రమం చేపట్టనున్నట్లు తెలిపారు. అద్దేపల్లిలోని షాదీఖానా మీటింగ్ హాల్‌లో సాయంత్రం 4 గంటలకు నిర్వహించనున్న క్యూఆర్ కోడ్ పోస్టర్ల ఆవిష్కరణ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షులు, మాజీ మంత్రి మేరుగ నాగార్జున, బాపట్ల పార్లమెంటరీ పరిశీలకులు తూమాటి మాధవరావు, రేపల్లె నియోజకవర్గ ఇన్‌చార్జి ఈవూరు గణేష్, రాష్ట్ర, జిల్లా నాయకులు పాల్గొననున్నట్లు ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు.

రేపు వైఎస్సార్‌సీపీ కార్యకర్తల సమావేశం

పిట్టలవానిపాలెం(కర్లపాలెం): వైఎస్సార్‌సీపీ మండల స్థాయి కార్యకర్తల సమావేశం ఈ నెల 4వ తేదీన సాయంత్రం 3 గంటలకు ఖాజీపాలెం కల్యాణ మండపంలో నిర్వహిస్తామని పిట్టలవానిపాలెం మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ ఉయ్యూరి లీలా శ్రీనివాసరెడ్డి బుధవారం ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి మాజీ శాసనసభ్యులు, వైఎస్సార్‌సీపీ బాపట్ల ఇన్‌చార్జి కోన రఘుపతి ముఖ్య అతిథిగా హాజరవుతారని, మండల పరిధిలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగాల అధ్యక్షులు, సభ్యులు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొనాలని శ్రీనివాసరెడ్డి కోరారు.

సమస్యలు పరిష్కరించాలని నిరసన



ఒంటి కాలుపై నిలబడి నిరసన తెలియజేస్తున్న మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు

రేపల్లె: మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో మున్సిపల్ ఇంజనీరింగ్ అండ్ వర్కర్స్ యూనియన్ కార్మికులు నిర్వహిస్తున్న నిరసన కార్యక్రమంలో భాగంగా బుధవారం మున్సిపల్ కార్యాలయం ఎదుట ఒంటి కాలుపై నిలబడి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా యూనియన్ కోశాధికారి కె.రాఘువేంద్రరావు మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులకు వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. సమాన పనికి సమాన వేతనం జీవో 36 ప్రకారం రూ.24,500 వేతనం అందించాలన్నారు. గతంలో సమస్యల సాధనకై నిర్వహించిన 17 రోజుల సమ్మె కాలంకు సంబంధించి ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలుకు జీవోలు విడుదల చేయాలని కోరారు. సమస్యలు పరిష్కరించకపోతే ఆందోళన కార్యక్రమాలు మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సమస్యల పరిష్కారం కోసం జూలై 4వ తేదీ నుంచి రాష్ట్ర వ్యాప్తంగా కార్మికులు నిర్వహిస్తున్న సమ్మెలో భాగంగా రేపల్లె ప్రాంతంలో సమ్మెలో పాల్గొంటున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో సీఐటీయూ బాపట్ల జిల్లా అధ్యక్షుడు మణిలాల్, యూనియన్ నాయకులు యువరాజు, శివ, రవి, శ్రీను, గీత, అనూష తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం



మోపర్రులో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఏవో భరత్



కౌలు రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్న ఏవో మహేష్‌బాబు

అమర్తలూరు(వేమూరు): వెద సాగులో ప్రధానంగా విత్తన మోతాదు, విత్తన శుద్ధి ఉండాలని మండల వ్యవసాయాధికారి ఎం.హేమంత్ భరత్ అన్నారు. అమర్తలూరు మండలంలోని తురుమెళ్ల, మోపర్రు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెద సాగు చేసిన 48 గంటల్లో కలుపు మందు పెండిమేతిలిన్ పిచికారీ చేయాలన్నారు. పచ్చిరొట్ట పైరులైన జనుము, జీలుగ, పిల్లిపెసర కలియదున్ని అందులో సూపర్‌ఫాస్ఫేట్ ఎకరానికి రెండు కట్టలు వేసుకుంటే ఉపయోగంగా ఉంటుందని చెప్పారు. కౌలు రైతులందరు త్వరితగతిన కౌలు కార్డు పొందాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారి బి.మణికంఠ, గ్రామ వ్యవసాయ సహాయకులు బి.భాస్కర్, కె.శ్రీనివాస్, రైతులు పాల్గొన్నారు.

భూసారాన్ని బట్టి ఎరువులను వినియోగించాలి

రేపల్లె: భూసారాన్ని బట్టి ఎరువుల వినియోగం చేయాలని మండల వ్యవసాయ అధికారి అవ్వారు మహేష్‌బాబు అన్నారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మండలంలోని చాటగడ్డ, కామరాజుగడ్డ రైతు సేవా కేంద్రాల పరిధిలో బుధవారం రైతులకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం సాగు ప్రారంభించేందుకు రైతులకు అనుకూలమైన వాతావరణం ఉందన్నారు. వ్యవసాయ కార్యాలయంలో విత్తనాలను అందుబాటులో ఉంచటం జరిగిందని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. విత్తన శుద్ధి, భూసార శాతం, దుక్కులు దున్నటం, ఎరువుల వినియోగం వంటి అంశాలలో సందేహాలు కలిగితే వ్యవసాయ అధికారులను అడిగి నివృత్తి చేసుకోవాలన్నారు. కౌలు రైతులు కౌలు గుర్తింపు కార్డులు పొందేందుకు దరఖాస్తు చేసుకోవాలని పూర్తి వివరాలకు కార్యాలయంలో సంప్రదించాలని కోరారు. కౌలు రైతుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. కార్యక్రమంలో ఏఈఓలు నవీన్, సుమతి, గ్రామ వ్యవసాయ సహాయకులు సౌందర్య, లక్ష్మి, సాయిబాబా పాల్గొన్నారు.

జనావాసాల మధ్య పందుల పెంపకం ఉండరాదు

మున్సిపల్ కమిషనర్ సాంబశివరావు



మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్

రేపల్లె: జనావాసాల మధ్య పందుల పెంపకం ఉండరాదని, రహదారులపై పందులు తిరగకుండా వాటి యజమానులు బాధ్యత వహించాలని మున్సిపల్ కమిషనర్ కాకర్ల సాంబశివరావు చెప్పారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో బుధవారం పట్టణంలోని పందుల యజమానులు, కాపలాదారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుత వర్షాకాల సీజన్‌లో అంటు వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున రహదారులపై తిరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పందుల పెంపకం నివాస గృహాల మధ్య ఉంచరాదన్నారు. పట్టణంలో రహదారులపై, నివాస గృహాల మధ్య విచ్చలవిడిగా పందుల సంచారం ఉందని ప్రజల నుంచి తరచూ ఫిర్యాదులు అందుతున్నాయని అన్నారు. పందులను పట్టణానికి దూరంగా తరలించాలని ఆదేశించారు. పందులను రహదారులపై వదిలేసే వారిపై చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ రామచంద్రరావు, ఎస్సై రాజశేఖర్ తదితరులు ఉన్నారు.

బడిమానేసిన పిల్లలను పాఠశాలకు పంపాలి



తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్న విద్యాశాఖాధికారులు

భట్టిప్రోలు (కొల్లూరు) : పాఠశాలకు రాకుండా మానివేసిన విద్యార్థులను తిరిగి తల్లిదండ్రులు బడికి పంపించి వారి భవితవ్యాన్ని తీర్చిదిద్దాలని ఎంఈవో-2 ఎస్.దేవరాజ్ అన్నారు. బుధవారం మండలంలోని వెల్లటూరు జగనన్న కాలనీలో ఆరుగురు బడిమానిన పిల్లలను తిరిగి బడిలో చేర్పించే కార్యక్రమంలో భాగంగా ఆయన ఉపాధ్యాయులు, సిబ్బందితో కలసి తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. చదువుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలను వారికి వివరించి తిరిగి పాఠశాల మానివేసిన పిల్లలను బడిలో చేర్పించారు. కార్యక్రమంలో క్లస్టర్ హెచ్ఎం కె.అరుణకుమారి, హెచ్ఎం వి.సురేష్ తదితరులు పాల్గొన్నారు.

కౌలు రైతులు సాగు హక్కు పత్రాలు తీసుకోవాలి

ఏవో సత్యానందం



మాట్లాడుతున్న ఏవో సత్యానందం

చందోలు(కర్లపాలెం): సాగు చేసే కౌలు రైతులు తప్పనిసరిగా సాగుదారు హక్కు పత్రాలను తీసుకోవాలని పిట్టలవానిపాలెం ఏవో సత్యానందం చెప్పారు. చందోలు గ్రామంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఏవో మాట్లాడుతూ సాగుదారు హక్కు పత్రాలతో వ్యవసాయ శాఖ ద్వారా అమలు జరిగే సంక్షేమ పథకాలను వినియోగించుకునేందుకు అర్హులని చెప్పారు. ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసే రైతులు ప్రభుత్వ అనుమతి కలిగిన డీలర్ల వద్దే విత్తనాలు కొనుగోలు చేయాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారులు సుదర్శనరావు, ప్రశాంతి, గ్రామ వ్యవసాయ సహాయకులు తేజస్విని, గుడారంకయ్య పాల్గొన్నారు.

కర్లపాలెం మండలంలో...

సాగుకు ముందుగా రైతులు విత్తన శుద్ధి చేయాలని కర్లపాలెం మండల వ్యవసాయాధికారి సుమంత్‌కుమార్ చెప్పారు. బుధవారం పేరలి, సమ్మెటవారిపాలెం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో సుమంత్‌కుమార్ మాట్లాడుతూ విత్తనాలను మొలక శాతం పరిశీలించుకున్న తరువాతే సాగుకు వినియోగించుకోవాలన్నారు. తెగుళ్లను తట్టుకుని అధిక దిగుబడులు ఇచ్చే వరి వంగడాలను ఎంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారి భాగ్యలక్ష్మి, గ్రామ వ్యవసాయ సహాయకులు షబీనా, తిరుమలేశ్, రైతులు పాల్గొన్నారు.

ఘనంగా సాల్వేషన్ ఆర్మీ వ్యవస్థాపక దినోత్సవం



జెండా ఆవిష్కరిస్తున్న పాస్టర్ జ్యోతి బాబు

అత్తులూరివారిపాలెం(కొల్లిపర): మండల పరిధిలోని అత్తులూరివారిపాలెంలో రక్షణ సైన్యం చర్చిలో పాస్టర్ దొప్పలపూడి జ్యోతిబాబు ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా సాల్వేషన్ ఆర్మీ వ్యవస్థాపక దినోత్సవం నిర్వహించారు. జ్యోతిబాబు చర్చి ఆవరణలో సాల్వేషన్ ఆర్మీ జెండాను ఆవిష్కరించి మాట్లాడుతూ గత 160 సంవత్సరాలుగా 185 దేశాల్లో దేవుని సేవలోనే కాక సమాజ సేవలో కూడా సాల్వేషన్ ఆర్మీ చేస్తున్న సేవలు ప్రపంచవ్యాప్తంగా ప్రజల మన్ననలు పొందుతున్నట్లు తెలిపారు. సందేశం అనంతరం చర్చిలో మిఠాయిలు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో సాల్విష్ట ఆర్మీ సంఘ పెద్దలు, సంఘస్తులు తదితరులు పాల్గొన్నారు.